# సింగిల్ పేజీ కథలు

## చెయ్యి జారిన స్వర్గం

శేషమ్మగారిది అదో రకమైన మనస్తత్వం. తనేదో పుట్టుకతోటే బంగారు స్పూన్ నోట్లో పెట్టుకొని పుట్టానని ఆవిడ భావం. అందుకు తగ్గట్టే వుంటుంది ఆవిడ ప్రవర్తన కూడా. తన అంతస్థుకు తగ్గవాళ్ళతో తప్ప తక్కువ వాళ్ళతో ఆవిడ సామరస్యంగా ప్రవర్తించదు. పనివాళ్ళనయితే ఆమడ దూరంలో వుంచుతుంది. ఏ మాత్రం చనువిచ్చినా, కనికరించినా నెత్తికెక్కుతారని ఆవిడ భావన.

ఏమాట కామాటే చెప్పుకోవాలి. ఆమె భర్త ప్రకశరావు ఎంతో సౌమ్యులు, వ్యాపారాల్లో ఎన్నో లక్షలు సంపాదిస్తున్నా భేషజం లేని మనిషి, తక్కువ ఎక్కువ అనే తారతమ్యం చూపకుండా అందరితోటి స్నేహభావంతో వుంటాడాయన, పైగా తాను సంపాదించిన దానిలోనే తోటివారిని కూడా ఆదుకోవాలన్న దానశీలి. ఉన్న ఒక్కగానొక్క కొడుకు రాజశేఖర్ తండ్రికి తగ్గ తనయుడే.


ప్రకాశరావుగారి చిన్ననాటి స్నేహితుడు శివరామయ్య ఆ వూళ్ళోనే వుంటాడు. నలుగురు ఆడపిల్లల తండ్రి. టీచరుగా పనిచేసి రిటైరయ్యాడు. ఇద్దరాడపిల్లల పెళ్ళిళ్ళు చేసి వున్నదంతా వూడ్చుకొని కేవలం పెన్షనుతోనే బ్రతుకీడుస్తున్నాడు. మిగతా యిద్దరాడపిల్లల పెళ్ళిళ్ళు ఎలా చెయ్యాలా అని బెంగతో కృశించిపోతున్నాడు. ఆత్మాభిమానంగల మనిషి కావడం వల్ల ప్రకాశరావుగారి ఆర్థిక సహాయాన్ని ఏనాడు ఆశించలేదు. పైగా తిరస్కరించాడు కూడా.

అందువల్లే ప్రకాశరావుగారి మనస్సులో ఒక ఆలోచన మెదిలింది. ఆడపిల్లలు కుందనపు బొమ్మలే. వినయ విధేయతలు వాళ్ళ సంస్కారం ప్రకాశరావుగారి మనస్సుకు ఎంతో ఆనందం కలిగించేయి. అందుకే మూడో అమ్మాయిని తన కోడలుగా చేసుకొంటే తన స్నేహితుడికి సాయం చేసినట్టు వుంటుంది. తన యింటికి చక్కటి కోడలు వస్తుంది అనుకున్నాడు.

ఆ మాటే భార్యతో అంటే ఆవిడ అంతెత్తున లేచింది. "మీకేం మతిపోయిందేమిటండీ. ఆ దిక్కుమాలిన ఆలోచన మీ మనస్సులోకి అసలెలా వచ్చింది. పూటకు ఠికాన లేని ఆ ముదనష్టపు కొంపనుంచి పిల్లని కోడలుగా తెస్తారా... నా కొడుక్కేం ఖర్మ. ఏ పది లక్షల కట్నంతోటో, సకల లాంఛనాలతోటి రేపీపాటికి సంబంధం నేను సెటిలుచేస్తాను. నా చుట్టూ నా ఫ్రెండ్స్ ఎంత మంది తిరుగుతున్నారో మీకు తెలుసా?" అంటూ గయ్ మని లేచింది.

'నా తల్లి తండ్రులు కూడా ఆనాడు అలాగే అనుకుంటే నువ్వానాడు మా యింట్లో కోడలుగా వుండేదానివా?' అనుకొన్నాడు ప్రకాశరావు మనస్సులో, ఆ మాటే పైకి అంటే ఇంకేమైనా వుందా.

ఎంత నచ్చచెప్పినా, భార్య వినలేదు. ఇంక ప్రాణం విసిగి మాటవరుసకి తన తమ్ముడు రంగారావుతో చెపితే నెల తిరక్కుండా తన పెద్ద కొడుక్కి ఆ సంబంధం ఖాయం చేసుకొని ఉభయ ఖర్చులు తనే పెట్టుకొని శివరామయ్య మూడో కూతుర్ని తన



యింటి పెద్దకోడలుగా తెచ్చుకున్నాడు. ప్రకాశరావు ఎంతో సంతోషించాడు. తను చెయ్యలేని పని తమ్ముడు చేసినందుకు, శేషమ్మ మాత్రం తోటికోడలిని ఇలాంటి సంబంధం చేసుకొన్నందుకు ఎంతో సాధించింది. కానీ ఆవిడమాత్రం చిరునవ్వే అన్నిటికి సమాధానంగా వుండిపోయింది.

* * *

ఏడాది తిరగకుండానే పదిహేను లక్షల కట్నం, లాంఛనంగా లక్ష, ఏడు వారాల నగలు, విలువైన వస్తువులు ఇతర లాంఛనాల పేరిట లక్ష్మీదేవి అడుగుపెట్టింది శేషమ్మ యింటిలో కొత్తకోడలు.

రోజులు గడుస్తున్నాయి. కోడలు పూచిక పుల్లంత పని ముట్టదు. ఎంతసేపు క్లబ్బులు, మీటింగులు, పార్టీలు అంటూ బయట తిరుగుతూనే వుంటుంది. అత్తమాటంటే అసలు లక్ష్యమేలేదు. "ఇల్లు పట్టించుకోకుండా అలా తిరిగితే ఎలా?" అని ఒక మారు శేషమ్మ అంటే "ఆ అవసరం నాకేంటి. మీరున్నారు, పైగా పనిమనుషులున్నారు" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి వెళ్ళిపోయింది.

భర్తతో చెబితే నవ్వి వూరుకొన్నాడు. కొడుకుతో అంటే అబ్బ ఇలాంటివన్నీ నాకు చెప్పకమ్మా.. మీరు మీరు చూసుకోండి అంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. శేషమ్మకి ఏం చెయ్యాలో తోచడం లేదు. ఇదివరకు శేషమ్మదే ఆ యింట్లో పెద్ద నోరనుకుంటే ఇప్పుడు ఆవిడ నోటికి నాలుగు రెట్లు అధికంగా నోరుపెట్టి ఆవిడ నోరు మూయిస్తోంది కోడలు.

పుండు మీద కారం రాసినట్టు తోటికోడలు యింటి వార్తలు మరింత బాధ పెడుతున్నాయి శేషమ్మని.

ఆ యింటికొచ్చిన కోడలు అత్తమామలను ఎంతో ప్రేమగా చూసుకొంటుందట.

బంధువర్గాన్నంతా ఎంతో ఆదరిస్తుందట. అక్కటి నుండి యిక్కడి కొచ్చిన బంధువులు ఆ వార్తలు చెబుతూ వుంటే, ఆ అమ్మాయిని, ఆ యింటిని పొగుడుతూ వుంటే తన తోటి కోడలి అదృష్టాన్ని వాళ్ళు వేనోళ్ళ కీర్తిస్తూ వుంటే శేషమ్మ తలకొట్టేసినట్టు అనిపిస్తోంది.

తన యింట్లో ఎప్పుడూ యుద్ధవాతావరణమే అత్తా కోడలు మధ్య ఆరని రావణకాష్టమే.

శేషమ్మకి యిప్పుడు తెలిసివస్తోంది. తను కేవలం డబ్బునే లక్ష్యంగా పెట్టుకుంది. కానీ దాని వల్లే సమస్త సుఖాలు లభించవని తెలుసుకోలేకపోయింది.

గోరుచుట్టు మీద రోకటి పోటులాగా బాత్‌రూంలో కాలుజారి పడింది శేషమ్మ, కాలు విరిగింది, కట్టు కట్టించి యింటికి తీసుకుని వచ్చారు. మనిషి ఆసరాలేందే తను అడుగువెయ్యలేదు. తన నోటికి జడిసి పనిమనుషులెవరూ ఆప్యాయంగా తనకి సేవ చెయ్యరు. కోడలు తన వైపే చూడదు. భర్త తప్పదన్నట్టు ఏదో చేస్తున్నా "చేసుకొన్న వాళ్ళకి చేసుకొన్నంత మహదేవా" అన్నట్టు వేదాంతిలా తను బాధపడినప్పుడల్లా తన వైపు చూస్తాడు.

ఇప్పుడనుకొంటోంది శేషమ్మ 'ఆ అమ్మాయినే తన కోడలిగా చేసుకొంటే.. హు.. తానే అందిన స్వర్గాన్ని చెయ్యి జార్చుకొంది..' నిట్టూరుస్తూ కళ్ళు మూసుకొంది శేషమ్మ, కంటి కనుకొనుకుల్లో రెండు కన్నీటి బొట్లు కిందకు జారాయి.

**-వి.సత్యవతీదేవి**
(గుమ్మలక్ష్మీపురం)

☆ ☆ ☆

# అతనికంటె ఘనుడు

దీనదయాళ్ చాలా ఐశ్వర్యవంతుడు. సాధారణంగా చుట్టాల్ని దరి చేరనీయడు. అయినా యితని మేనమామ గోపాల్ తరచుగా హైదరాబాద్ వచ్చి, దీనదయాళ్ ఇంట్లో మకాం పెడతాడు. అతడి అయిష్టాన్ని గ్రహించినా పట్టించుకోడు.

దీనదయాళ్‌కి ముగ్గురు మగ పిల్లలు. ముగ్గురూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ముగ్గురికి ఎవరి కార్లు వాళ్ళకి వున్నాయి. ఎవరి సెల్‌ఫోన్లు వారికి వున్నాయి.

ఓసారి గోపాల్ హైదరాబాద్ వచ్చి పదిహేను రోజులుండిపోయాడు. వీడ్ని ఎలా అయినా, తిరుగు ప్రయాణం కట్టించాలని, తన కొడుకులతో చెప్పాడు దీనదయాళ్.

ఆ రోజు ఉదయం హాల్లో కాఫీ తాగేటప్పుడు, పెద్దపిల్లాడు తన తండ్రి మేనమామతో అన్నాడు. "చూడండి సార్! రోజులు చాలా మారిపోయాయి. శీతాకాలంలో కూడా సెల్‌ఫోన్ బ్యాటరీలు పేలిపోతున్నాయ్. మచిలీపట్నంలో ఓ సెల్ ఫోన్ పేలిపోయి పసికందుకి దెబ్బలు తగిలాయట"

"అలాగా" అంటూ "ఆ పేపర్ యిటు యియ్యి! నేను కూడా చదువుతాను" అని పేపర్ తీసుకున్నాడు గోపాల్. పేపరు చదివి "చాలా శోచనీయం" అన్నాడు.


ఆరోజు రాత్రి గోపాల్ పడుకున్న మంచంమీద సెల్ ఫోన్ చార్జింగ్‌లో పెట్టాడు పెద్ద కొడుకు. అర్ధరాత్రి గోపాల్‌కి మెళకువ వచ్చేసరికి తన ప్రక్కమీద సెల్‌ఫోన్ కనిపించింది. 'పక్కలో బల్లెం' అన్న సామెత విన్నాడు కాని, 'పక్కలో సెల్‌ఫోన్' దాని అనర్థాలు గురించి నిన్ననే విన్నాడు.

స్విచ్ ఆపేసాడు. పొద్దునే దీనదయాళ్ పెద్దకొడుకుతో అన్నాడు. "రాత్రి నా పక్కలో సెల్‌ఫోన్ చార్జింగ్‌లో ఎవరో పెట్టారు. అది పేలితే ఎంత ప్రమాదమో!"

"పెద్ద ప్రమాదం ఏం వుండదు! పక్కమీద పడుకున్న వాడు పక్కమీదే పోతాడు" అన్నాడు దీనదయాళ్ పెద్ద కొడుకు.

"పేలినా కొంతమంది పోరు" అన్నాడు రెండో వాడు.

"మంచి వాళ్ళు పేలక పోయినా పోతారు" అన్నాడు పెద్దకొడుకు.



"పుట్టిన వాడు గిట్టక మానడు" అన్నాడు, యిదంతా తన తిరుగు ప్రయాణం కట్టించే ప్రయత్నమనుకుని వూహించిన గోపాల్.

"అయినా పాపాత్ములు ఓ పట్టాన పోరు" అన్నాడు రెండో వాడు.

వాళ్ళ నోరు మూయించడానికి "ఏమిటో! యీ వెధవ పేలుళ్ళు!" అన్నాడు గోపాల్.

★ ★ ★

ఆ రోజు రాత్రి రెండో వాడు గోపాలం పక్కలో తన సెల్‌ఫోన్ చార్జింగ్‌లో పెట్టాడు.

అర్ధరాత్రి పెద్ద చప్పుడయింది. 'సెల్‌ఫోన్ పేలి వుంటుంది. తిరుగు ప్రయాణమవకుండానే పోయాడు, పాపం గోపాల్' అనుకున్నారు. గోపాల్ నిద్రిస్తున్న గదిలోకి తొంగి చూసి తెలుసుకున్న విషయం - సెల్‌ఫోన్ పేలినంతగా గోపాల్ తుమ్మాడని. అంత పెద్దగా తుమ్మి, మళ్ళీ నిద్ర పోయే ముందు ఓ అరగ్లాసు నీళ్ళు ఆ సెల్‌ఫోన్ మీద చిలకరించాడు గోపాల్.

పొద్దునే దీనదయాళ్ కొడుకులతో- "దీపావళి టపాసులన్నీ ఒకేలా పేలనట్లే అన్ని సెల్‌ఫోన్లూ పేలవు! ఏమిటో మన భ్రమ! ఎక్కడో ఓ చోట బస్సు దేన్నో గుద్దేసి ప్రయాణీకులు పోతే, అన్ని చోట్లా అలా జరుగుతుందనుకోవడం మూర్ఖత్వం. ఏ పేలుడయినా నా పెళ్ళాం పేలుడుకి సమానం కాదు. ఈ రోజు మీ ఇంట్లో వున్న సెల్ ఫోన్లన్నీ నా పక్కలోనే చార్జింగ్‌లో పెట్టండి, ఏం జరుగుతుందో చూస్తాను! నన్ను భయపెట్టి, మీ యింటి నుంచి పంపడానికి ప్రయత్నం చెయ్యకండి! భక్తితో ప్రయాణ ఖర్చులిచ్చి పంపితే, నేనే పోతాను. లేకపోతే మీ సెల్‌ఫోన్లన్నీ నీళ్ళలో నానిపోతాయి" అన్నాడు గోపాల్ చిద్విలాసంగా. వెర్రి మొహాలు వేసుకున్న దీనదయాళ్ పుత్రత్రయం ఓ వెయ్యినూట పదహార్లు భక్తితో చదివించారు. ఆ ధనం స్వీకరించి, తిరుగు ప్రయాణమయ్యాడు గోపాల్.

'హమ్మయ్య!' అనుకున్నారు యింటిల్లిపాది.

**-భమిడిపాటి సోమయాజి**
(హైదరాబాద్)